సాక్షి నల్లగొండ

ఆదివారం, 5, అక్టోబర్, 2025



అన్యాయం జరగనివ్వను

రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు అన్యాయం జరగనివ్వనని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



విషాదం నింపిన గెట్ టుగెదర్

సరదాగా నీటి సంపులో దిగి ఈత కొడుతుండగా.. ప్రమాదవశాత్తు అందులో మునిగి ఇద్దరు మృతిచెందారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు


ప్రస్తుత నీటి మట్టం	:	587.50 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,42,862 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,42,862 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,292 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,718 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తర్వాత తిరిగి యథావిధిగా ప్రజావాణి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని బాధితులు గమనించాలని కోరారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న వరదనీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరదనీటి రాక కొనసాగుతోంది. శనివారం మూసీకి 2,579 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో అధికారులు ప్రాజెక్టు రెండు క్రస్ట్‌గేట్లను పైకెత్తి 2,601 క్యూసెక్కుల నీటిని వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ఆయకట్టులో పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వకు 529 నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.12 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో శనివారం స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కళ్యాణ్‌నాయక్, తూటుపల్లి రవికుమార్, గోలి మధుసూదన్ రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బండారు ప్రసాద్, పిల్లి రామరాజు, దోనూరు వీరారెడ్డి, సాధినేని శ్రీనివాస్, నకిరేకంటి మొగిలయ్య, పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, సజ్జల నాగిరెడ్డి పాల్గొన్నారు.

స్వర్ణగిరీశుడికి గజవాహన సేవ

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి గజవాహన సేవ నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి, అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి గజవాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని కనులారా వీక్షించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్యకల్యాణం, వసంతోత్సవం, సాయంత్రం హనుమంత వాహనసేవ, రాత్రి జలనారాయణ స్వామికి మంగళహారతుల సమర్పణ తదితర పూజలు నిర్వహించారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నిత్యారాధనలో భాగంగా నిత్య కల్యాణం నేత్రపర్వంగా చేపట్టారు. శనివారం వేకువజామున శ్రీస్వామి,అమ్మవార్లకు సుప్రభాత సేవ, అనంతరం గర్భాలయంలో కొలువైన స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఆ తరువాత ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం , గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం వేళ వెండి జోడు సేవలను ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మానసిక ఆరోగ్యం అవసరం



మానసిక ఆరోగ్యం- శ్రేయస్సుపై నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె ఎన్జీ కాలేజీ మైదానంలో మానసిక ఆరోగ్యం శ్రేయస్సు అవగాహన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 12వ తేదీ వరకు మానసిక ఆరోగ్యం - శ్రేయస్సుపై లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. స్మార్ట్ ఫోన్ వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలన్నారు. పోటీ పరీక్షలు, ఇతర విషయాల్లో పేద పిల్లలకు సహాయం చేసేందుకు నల్లగొండలో ఒక టౌన్‌హాల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని అందుకు లయన్స్ క్లబ్ కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్‌మోహన్, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, తీగల మోహన్‌రావు, రవీందర్‌రావు, చిలుకూరి రామకృష్ణ, గట్టుపల్లి అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పొత్తు ఎవరితో?

స్థానిక ఎన్నికల్లో పొత్తులు, అవగాహనపై పార్టీల కసరత్తు

- కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసే ఆలోచనలో కమ్యూనిస్టులు
- మునుగోడు, దేవరకొండలో సీట్లు కోరనున్న సీపీఐ
- జిల్లా కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్న సీపీఎం
- అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధమవుతున్న బీజేపీ
- అభ్యర్థులను తేల్చే పనిలో బీఆర్ఎస్
- ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక బాధ్యత డీసీసీలకు అప్పగించిన కాంగ్రెస్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులు, పరస్పర అవగాహన, స్నేహపూర్వక పోటీపై రాజకీయ పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. ఈ నెల 9వ తేదీ నుంచి జిల్లా, మండల పరిషత్ ఎన్నికలకు నామినేషన్లు ప్రారంభం కానుండడంతో అభ్యర్థులను తేల్చే పనిలో పార్టీలు నిమగ్నమయ్యాయి. నేరుగా పొత్తు పెట్టుకుని పోటీ చేయాలా.. లేక స్నేహ పూర్వక పోటీనా అనే విషయాలపై సమాలోచన చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు పెట్టుకున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం ఒంటరిగానే బరిలోకి దిగాయి. ఈ ఎన్నికల్లో ఎలా ముందుకు సాగాలన్న దానిపై సోమవారం నాటికి అన్ని పార్టీల్లో స్పష్టత రానుంది.

కాంగ్రెస్‌తో కలిసి పోదామా..

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉంది. ఈనేపథ్యంలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐతోపాటు సీపీఎం కూడా అధికార కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకునే ఆలోచన చేస్తోంది. దీనికి సంబంధించి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఇతర ముఖ్య నేతలతోపాటు సీపీఎంకు చెందిన కొందరు నేతలు.. అధికార కాంగ్రెస్ పార్టీతో పొత్తుతో ముందుకు సాగితే బాగుంటుందన్న ఆలోచన చేశారు. అయితే ఈనెల 5వ తేదీ లేదంటే 6వ తేదీన సీపీఎం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

పోటీ ఎక్కడెక్కడ..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుంటే ఎక్కడెక్కడ ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను అడుగాలన్న దానిపై ఆ పార్టీ చర్చిస్తున్నట్లు తెలిసింది. పొత్తు కుదరకపోతే ఎక్కడెక్కడ పోటీ చేయాలన్న దానిపైనా ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనుంది. సీపీఎం తమతో కలిసి రావాలని సీపీఐ కూడా కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌తో స్నేహబంధం ఉన్న సీపీఐ.. మూడు పార్టీల పొత్తుకు కాంగ్రెస్‌ను ఒప్పించే ఆలోచన చేస్తోంది. మరోవైపు తమకు పట్టున్న మునుగోడులో రెండు జెడ్పీటీసీలు, రెండు ఎంపీపీలు, దేవరకొండ నియోజకవర్గంలో ఒక జెడ్పీటీసీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీని కోరేందుకు సిద్ధమవుతోంది. దీనిపై 8వ తేదీ తరువాత తుది నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు సర్పంచ్ స్థానాల విషయంలో స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోవాలని సీపీఐ, సీపీఎం ఆలోచన చేస్తున్నాయి.

మండలాల వారీగా బీఆర్ఎస్ సమావేశాలు..

బీఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాల్లోనూ సొంతంగానే పోటీ చేయబోతోంది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. శనివారం మండలాల వారీగా సమావేశాలను ప్రారంభించింది. మండల పార్టీ నేతల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వారీగా ముఖ్య నేతలను పిలిపించుకుని అభిప్రాయాలు సేకరిస్తోంది. గెలుపు కోసం చేయాల్సిన ప్రయత్నాలపై కార్యకర్తలు, నేతలను సిద్ధం చేసే పనిలో ఉంది.


బీజేపీ ఒంటరి పోరు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించింది. శనివారం నల్లగొండలో సన్నాహక సమావేశం జరిగింది. అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని నిర్ణయించింది. మరోవైపు పార్టీ ముఖ్య నేతలు కూడా ఈసారి ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేయాలని నిర్ణయించింది. నాగం వర్షిత్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్ వంటి వారిని పోటీలో దింపాలని పార్టీ భావించినా, వారి ఓట్లు నల్లగొండ పట్టణంలో ఉండటంతో పోటీ చేసే అవకాశం కనిపించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

డీసీసీలకే అభ్యర్థుల ఎంపిక బాధ్యత..

అధికార కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ అభ్యర్థుల విషయంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో జాబితాలను పంపిస్తే రాష్ట్ర పార్టీ నిర్ణయం తీసుకోనుంది. ఇక ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక బాధ్యతలను మాత్రం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకే (డీసీసీ) అప్పగించింది. ఎంపీటీసీ నియోజకవర్గ స్థాయిలో ఏ అభ్యర్థి అయితే విజయం సాధిస్తారు.. వాళ్లు పార్టీకి ఏ మేరకు పనిచేశారు అనే దానిపై సమాచారం సేకరించడంతో పాటు పార్టీ కోసం పని చేసిన వారికే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు నేతలు చెబుతున్నారు. మరోవైపు ఈసారి సీపీఐ, సీపీఎం పొత్తు ఉంటే, వారికి కొన్ని స్థానాలను ఇవ్వాల్సి వస్తుంది. అలాంటి స్థానాల్లో ఉండి పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆశావహులను ఎలా సర్దుబాటు చేయాలనే దానిపై ఆయా పార్టీల జిల్లా నేతలు, మండల నేతలతో చర్చిస్తున్నారు.

సాగర్‌కు వరద తగ్గుముఖం



24 గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు

నాగార్జునసాగర్ : ఎగువనుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వస్తున్న వరద కొంత మేరకు తగ్గుముఖం పట్టింది. శనివారం 26 రేడియల్ క్రస్ట్‌గేట్లకుగాను 24 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 2,42,862 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా క్రస్ట్‌గేట్ల ద్వారా 1,88,112 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 33,292 క్యూసెక్కులు.. మొత్తం 2,21,404 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి వదులుతున్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతుండటంతో పర్యాటకుల సందడి నెలకొంది. శనివారం సాగర్‌కు పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. కృష్ణా తీరం వెంట, ఎత్తిపోతల, అనుపు, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. నాగార్జున కొండ మ్యూజియాన్ని సందర్శించేందుకు లాంచీల్లో వెళ్లారు. అక్కడ మ్యూజియంలోగల రాతి, ఇనుప పనిముట్లు, బౌద్ధమతవ్యాప్తికి సంబంధించిన ఆనవాళ్లు, విగ్రహాలను సందర్శించారు.



లాంచీ దిగివస్తున్న పర్యాటకులు

అలరించిన నృత్య ప్రదర్శన



భువనగిరి : మండల పరిధిలోని రాయగిరి మినీ శిల్పారామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన సృజన అకాడమీ బృందం కళాకారులు భరతనాట్యంతో అలరించారు. సందర్శకులు ప్రదర్శనలు తిలకించి, చెరువులో బోటు షికారు చేసి ఆహ్లాదంగా గడిపారు.

డిండిలో సద్దుల బతుకమ్మ



డిండిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

డిండి : డిండి మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం దసరా పండుగ తర్వాతి రోజు బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సంబరాలు జరిగాయి. వివిధ రకాల పూలతో తయారు చేసిన బతుకమ్మలను ఒకే చోట ఉంచి మహిళలు బతుకమ్మ ఆడారు. ప్రత్యేకంగా బతుకమ్మలు తయారు చేసిన మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం డిండి ప్రాజెక్టులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

6న బాక్సింగ్ ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్: మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పీ మైదానంలో ఈ నెల 6న ఉదయం 9 గంటలకు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డి.విమల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన బాలబాలికలు అర్హులని ఆమె తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 9 గంటల్లోగా మిర్యాలగూడ ఎన్ఎస్‌పీ గ్రౌండ్‌కు చేరుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 97032 69840 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



దుబ్బకాల్వలో ఎర్రబారిన పత్తి చేను

పత్తి రైతుల పరేషాన్

మునుగోడు : పత్తి సాగు చేసినా రైతులు పరేషాన్‌లో పడ్డారు. నెల రోజుల క్రితం వరకు అడపా దడపా కురిసిన వర్షాలకు పత్తి పంటలు ఏపుగా పెరిగి మంచి కాయ, పూతతో పచ్చగా దర్శనం ఇచ్చాయి. కానీ ఇటీవల కురిసిన వర్షాలతో చేలల్లో నీరు నిల్వ ఉండి పంట అంతా ఎర్రబారిపోయింది. అంతే కాకుండా పూత నేల రాలిపోవడంతో పాటు గతంలో కాయలు పాచిపోయి, పగిలిన పత్తి నల్లబారిపోతోంది. దీంతో ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చేది కష్టమేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాల కారణంగా పంట నష్టపోయి అప్పులపాలైయ్యే పరిస్థితి దాపురించిందని.. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వర్షానికి తడిసి నల్లగా మారుతున్న పత్తి, పాచిపోయిన పత్తి కాయలు

జనహృదయ నేతకు కన్నీటి వీడ్కోలు

- తుంగతుర్తిలో ముగిసిన మాజీమంత్రి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు
- తమ అభిమాన నాయకుడిని కడసారి చూసేందుకు తరలివచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులు
- జోహార్ దామన్న అంటూ అశ్రునివాళి
- హాజరైన మంత్రులు పీసీసీచీఫ్ మహేష్‌కుమార్, ఉత్తమ్, కోమటిరెడ్డి, లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఎంపీ



ఆర్డీఆర్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి



తుంగతుర్తిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆర్డీఆర్ అంతిమయాత్రకు తరలివచ్చిన జనం

తుంగతుర్తి: ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాల పాటు తనదైన ముద్ర వేసుకున్న జనహృదయనేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని తన గడి వెంట ఉన్న వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. మధ్యాహ్నం 2గంటలకు గౌరవసూచకంగా పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆర్డీఆర్ కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి తండ్రి చితికి నిప్పంటించారు. ఉమ్మడి జిల్లాలో తిరుగులేని నాయకుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన దామన్నను కడసారి చూసేందుకు ఉమ్మడి నల్లగొండ, వరంగల్, హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు, అభిమానులు, పార్టీశ్రేణులు తండోపతండాలుగా తరలివచ్చారు. తమ అభిమాన నేతను చూసి కన్నీటిపర్యంతమయ్యారు. జోహార్ దామన్న అంటూ నినాదాలు చేశారు.

ప్రముఖుల శ్రద్ధాంజలి

ఈ అంత్యక్రియల్లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వృద్ధుల వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నలగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు మందుల సామేలు, పద్మావతిరెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే అనిల్‌రెడ్డి రాజేందర్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకేపల్లి సుధీర్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, మాజీ ఎంపీలు వి.హన్మంతరావు, బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, గాదరి కిషోర్‌కుమార్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి, మహిళా కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు అనురాధ కిషన్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతు భాస్కర్, టీపీసీసీ సభ్యుడు గుడిపాటి నర్సయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్, ఎస్పీ కె.నరసింహలతో పాటు పలువురు ప్రముఖులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

శోక సంద్రంలో తుంగతుర్తి

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి తుంగతుర్తి ప్రజలతో పాటు, ఆయన అభిమానులను శోక సంద్రంలో ముంచింది. జనహృదయనేతను కడసారి చూసేందుకు ప్రజలు, అభిమానులు వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చారు. దామోదర్ రెడ్డి పార్థివ దేహం శుక్రవారం రాత్రి తుంగతుర్తిలోని స్వ గృహానికి చేరే వరకు వేచి ఉన్నారు. అలాగే శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నివాళులర్పించారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు వచ్చి కన్నీటి పర్యంతం అయ్యారు.



తమ అభిమాన నేతను కడసారి చూసి కన్నీటిపర్యంతమవుతున్న మహిళలు



దామన్న భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న గుత్తా, చిత్రంలో సామేలు



అధికారిక లాంఛనాలతో ఆర్డీఆర్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

సాగర్‌కు సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి



నాగార్జునసాగర్ వద్ద జస్టిస్ ఎన్వీ రమణతో స్థానిక అధికారులు

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను శనివారం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సందర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని బెల్లంకొండలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన తిరిగి హైదరాబాద్ వెళ్తూ నాగార్జునసాగర్‌ను సందర్శించారు. సాగర్ డ్యాం, ప్రధాన జలవిద్యుత్ ఉత్పాదన కేంద్రం, నాగార్జునకొండ ప్రాంతాలను సందర్శించారు. స్థానిక గైడ్ సత్యనారాయణ చారిత్రక విశేషాలను వివరించారు.

చింతపల్లి సాయిబాబాను దర్శించుకున్న మాజీ సీజేఐ

కొండమల్లేపల్లి(చింతపల్లి): చింతపల్లి మండల కేంద్రంలో గల సాయిబాబా ఆలయాన్ని శనివారం సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబా క్షేత్రం ఎంతో ఆధ్యాత్మికంగా ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట శ్రీనివాసరాజు, ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

ఆర్టీసీ కండక్టర్ అదృశ్యం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం డి.నాగారం గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డి.నాగారం గ్రామానికి చెందిన సుర్కంటి కిరణ్‌రెడ్డి(32) కొన్ని సంవత్సరాలుగా హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసముంటూ దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి నాలుగేండ్ల క్రితం వివాహం జరిగింది. వారికి సంతానం కల్గలేదు. గత రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కిరణ్‌రెడ్డి గత ఆరు నెలల నుంచి భార్యకు దూరంగా.. గత రెండు నెలలుగా ఉద్యోగానికి వెళ్లకుండా స్వగ్రామం డి.నాగారంలోనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. కుటుంబ సభ్యులు శనివారం తెల్లవారుజామున నిద్ర లేచి చూడగా కిరణ్‌రెడ్డి కనిపించలేదు. అతడు బైక్ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల మొత్తం వెతికారు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో కిరణ్‌రెడ్డి సోదరుడు గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

బహిర్భూమికి వెళ్లి మృతి

నూతనకల్: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం తాళ్లసింగారం గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లసింగారం గ్రామానికి చెందిన గంజి ధర్మపురి కుమారుడు గంజి రాము(41) సూర్యాపేట జిల్లా కేంద్రంలో నివాసముంటున్నాడు. దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చిన రాము బుధవారం సాయంత్రం బహిర్భూమి కోసం గ్రామ శివారులోని వాగు వద్దకు వెళ్లాడు. ఎంతసేపటికీ అతడు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శనివారం వాగు వద్దకు వెళ్లిన వ్యక్తులకు నీటిలో మృతదేహం తేలియాడుతుండడం చూసి గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు వచ్చి చూసి మృతిచెందింది గంజి రాముగా గుర్తించారు. మృతుడి సోదరుడు సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు అన్యాయం జరగనివ్వను

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితులు

చిట్యాల: రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగనివ్వని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో శనివారం ఆయనను చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని, సంస్థాన్‌నారాయణపురం మండలం లింగవారిగూడెం గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, ఇంకా ఎలాంటి అలైన్‌మెంట్ జరగలేదని అన్నారు. ప్రభుత్వం, అధికారులు చెప్పేంత వరకు వివిధ పత్రికల్లో అలైన్‌మెంట్‌పై వస్తున్న కథనాలను నమ్మొద్దని అన్నారు. గ్రామాల్లో అధికారులతో సభలు నిర్వహించి రైతుల అంగీకారంతోనే న్యాయమైన పరిహారం చెల్లించి భూసేకరణ చేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

జాతీయ రహదారికి మరమ్మతులు..

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని 2022లోనే విస్తరణ చేయాల్సిందన్నారు. కానీ జీఎంఆర్ సంస్థ పనులు చేపట్టకపోవటంతో పాటు రహదారి నిర్వహణ నుంచి వైదొలిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం హైవే పలు చోట్ల ధ్వంసమైందని, మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చినట్లు ఆయన తెలిపారు. హైవే విస్తరణతో పాటు ఇరువైపులా సర్వీస్ రోడ్లతో విస్తరించేందుకు డిసెంబర్‌లో టెండర్లు పిలిచి, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను మరో 250 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు వివరించారు. అనంతరం రీజినల్ రింగ్ రోడ్డు రైతులు పల్లెల పుష్పారెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, పగిళ్ల మోహన్‌రెడ్డి మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ విలేకరుల సమావేశంలో చిట్యాల మున్సిపాలిటి మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, చౌటుప్పల్ మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఆవుల యాదయ్య, దోర్నాల రామచంద్రం, నీలకంఠం లింగస్వామి, ఇబ్రహీం, ఎడ్ల మహాలింగం తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు తరలివచ్చిన భక్తులు



ఆలయ మాడ వీధిలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట: దసరాకు సొంతూళ్లకు వెళ్లిన హైదరాబాద్ వాసులు తిరుగు ప్రయాణంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వస్తున్నారు. దీంతో శనివారం ఆలయ పరిసరాలు, క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాడ వీధులు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి 45 నిమిషాల సమయం పట్టింది. స్వామిని 35వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిత్యాదాయం రూ.41,31,970 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

దామన్న ఆశయ సాధనకు కృషిచేస్తాం

- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తుంగతుర్తి: దివంగత నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలకు హాజరై ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దామోదర్‌రెడ్డి చేసిన కృషి విస్మరించలేనిదని అన్నారు. అన్నిరకాల ఆటుపోట్లను అధిగమించి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన ఘనత దామోదర్‌రెడ్డికే దక్కిందన్నారు. వ్యాపార దృక్పథంతో రాజకీయాలు నడుస్తున్న ఈ రోజుల్లో పార్టీని, పార్టీ యంత్రాంగాన్ని కాపాడుకునేందుకు సొంత ఆస్తులను అమ్ముకున్న మహానేత దామోదర్‌రెడ్డి అని పేర్కొన్నారు. తాను తొలిసారి 1994లో శాసనసభ్యుడిగా ఓటమి చవిచూసినప్పుడు ఆనాటి తెలుగుదేశం, వామపక్షాలు కోదాడ నియోజకవర్గంలో హింసాత్మక సంఘటనలతో పెట్రేగిపోతున్న తరుణంలో దివంగత దామోదర్‌రెడ్డి అందించిన చేయూతను తాను ఎప్పటికీ మరచిపోలేనన్నారు. అటువంటి మహానేత మన నుంచి నిష్క్రమించడం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లేందుకు సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక శాసనసభ్యులు, లోకసభ సభ్యులు, పార్టీ యంత్రాంగంతో కలసి పనిచేస్తామని అన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



నాగరాజు(ఫైల్)

సూర్యాపేటటౌన్ : ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన జనగామ– సూర్యాపేట రహదారిపై సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామ స్టేజీ సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాంపురం కాలనీకి చెందిన సారగండ్ల నాగరాజు(32), అతడి స్నేహితుడు సంతోష్ మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి అంత్యక్రియలకు వెళ్లి బైక్‌పై తుంగతుర్తి నుంచి సూర్యాపేటకు వస్తుండగా.. సూర్యాపేట నుంచి అర్వపల్లి వైపు వెళ్తున్న కారు జనగామ– సూర్యాపేట రహదారిపై సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామ స్టేజీ సమీపంలో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న సారగండ్ల నాగరాజు రోడ్డుపై ఎగిరిపడి అక్కడికక్కడే మృతిచెందగా.. బైక్ నడిపిస్తున్న సంతోష్‌కు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన కొద్దిక్షణాల్లోనే బత్తుల సైదులు అనే వ్యక్తి స్కూటీపై సూర్యాపేట వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో బైక్‌ను తగిలి కిందపడిపోగా.. అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాదంపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..



సాయిలు (ఫైల్)

నాంపల్లి: రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నాంపల్లి మండలం వడ్డేపల్లి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. నాంపల్లి మండలం తీపిగౌరారం గ్రామానికి చెందిన జిల్లాల సాయిలు (64) నాంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి దారి వెంట వెళ్లే బైక్‌ను ఆపి నాంపల్లికి వస్తున్నాడు. మార్గమధ్యలో మండల కేంద్రం నుంచి మరుగూడెం వైపు వెళ్తున్న మరో బైక్ సాయిలు వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న సాయిలు కింద పడి తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. స్థానికులు మృతదేహాన్ని తీసుకెళ్లనీయకుండా ఆందోళన చేయడంతో పోలీసులు వారికి సర్దిచెప్పి సాయిలు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దేవరకొండకు తరలించారు. నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న బాలల సంక్షేమ సమితి సభ్యులు

భువనగిరి: ఆలేరులో తప్పిపోయిన బాలుడిని బాలల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శనివారం అతడి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. బాలల సంక్షేమ సమితి చైర్మన్ బండారు జయశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 30వ తేదీన ఆలేరులో 9 సంవత్సరాల బాలుడు తప్పిపోయాడు. పోలీసులు బాలుడిని గుర్తించి భువనగిరిలోని బాలల సంక్షేమ సమితికి సమాచారం అందించారు. ఆ బాలుడికి భువనగిరిలోని చైల్డ్ కేర్ ఇనిస్ట్యూషన్స్‌లో ఆశ్రయం కల్పించారు. బాలుడి స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి అని తెలుసుకుని అతడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న బాలుడి తల్లిదండ్రులు శనివారం భువనగిరిలోని బాలల సంక్షేమ సమితికి రాగా.. వారికి బాలుడిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు ఎర్ర శివరాజ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విషాదం నింపిన గెట్ టుగెదర్



నీటి సంపులో నుంచి విద్యార్థులను బయటకు తీయిస్తున్న పోలీసులు

- ఫాంహౌస్‌లో కలుసుకున్న పదో తరగతి స్నేహితులు
- అందులోని నీటి సంపులో ఈత కొడుతూ నీట మునిగి ఇద్దరు మృతి
- నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఘటన



రోదిస్తున్న రిషిక్ తల్లి





నల్లగొండ రిషిక్ (ఫైల్) హర్షవర్ధన్ (ఫైల్)

నార్కట్‌పల్లి: దసరా సెలవుల్లో ఓ ఫాంహౌస్‌లో కలుసుకున్న ఇంటర్మీడియట్ విద్యార్థులు సరదాగా నీటి సంపులో దిగి ఈత కొడుతుండగా.. ప్రమాదవశాత్తు అందులో మునిగి ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర్లబావి గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన నల్లగొండ నాగరాజు, స్వాతి దంపతుల పెద్ద కుమారుడు రిషిక్(17), చౌటుప్పల్ పట్టణానికి చెందిన పోలోజు శ్రీను పెద్ద కుమారుడు హర్షవర్ధన్(17)తో పాటు మరికొంత మంది నార్కట్‌పల్లి సమీపంలోని విద్యాపీఠ్ పాఠశాలలో కలిసి పదో తరగతి చదువుకున్నారు. ప్రస్తుతం వారంతా హైదరాబాద్‌లో వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. రిషిక్, హర్షవర్ధన్‌తో పాటు నార్కట్‌పల్లి, చౌటుప్పల్, చిట్యాల, హైదరాబాద్, నకిరేకల్ తదితర ప్రాంతాలకు చెందిన 15 మంది స్నేహితులు కలసి దసరా సెలవుల్లో నార్కట్‌పల్లిలో కలుసుకుందామని నిర్ణయించుకున్నారు. శనివారం అందరూ కలిసి నార్కట్‌పల్లికి చేరుకుని వారిలో ఓ స్నేహితుని తండ్రి సహకారంతో జువ్విగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరబావి గ్రామ సమీపంలో ఓ డీఎస్పీకి చెందిన ఫాంహౌస్‌లో కలుసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అక్కడికి చేరుకొని సరదాగా గడిపారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం రిషిక్, హర్షవర్ధన్‌తో పాటు మరో ఇద్దరు ఈత కొట్టేందుకు ఫాంహౌస్‌లోని నీటి సంపులోకి దిగారు. రిషిక్‌కు ఈత సరిగా రాక అందులో మునిగిపోయాడు. దీంతో హర్షవర్ధన్ వెంటనే రిషిక్‌ను కాపాడేందుకు యత్నించగా.. అతడు కూడా నీటి సంపులో మునిగిపోయాడు. వారి స్నేహితులు వెంటనే ఫాంహౌస్ వద్ద పనిచేస్తున్న వ్యక్తికి విషయం తెలియజేయగా.. అతడు ఫాంహౌస్ యజమానికి సమాచారం ఇచ్చాడు. ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో ఇద్దరు విద్యార్థులను నీటి సంపు నుంచి బయటికి తీయగా అప్పటికే మృతిచెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రిషిక్ తల్లిదండ్రులు నార్కట్‌పల్లి మండల కేంద్రంలోనే కిరాణ దుకాణం నడిపిస్తుండగా, హర్షవర్ధన్ తండ్రి చౌటుప్పల్ మండల కేంద్రంలో రేడియం దుకాణం నిర్వహిస్తున్నాడు.

బైక్ కొనివ్వలేదని విద్యార్థి ఆత్మహత్య



గణేష్ (ఫైల్)

నూతనకల్: బైక్ కొనివ్వలేదని మనస్తాపంతో ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నూతనకల్ మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లసింగారం గ్రామానికి చెందిన పల్సా భిక్షం కుమారుడు పల్సా గణేష్(17) పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తనకు కొత్త బైక్ కొనివ్వాలని దసరా రోజు గణేష్ తన తల్లిదండ్రులను అడగగా.. వారు అందుకు ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన గణేష్ శుక్రవారం రాత్రి ఇంట్లోని తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుమారుడు మనస్తాపానికి గురైన విషయాన్ని అర్థం చేసుకున్న తండ్రి శనివారం తెల్లవారుజామున గణేష్ గదిలోకి వెళ్లగా అతడు ఉరికి వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారికి విషయం చెప్పి కిందకు దించి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ డ్యాం దిగువన ఆంజనేయ స్వామి పుష్కరఘాట్‌కు 50 అడుగుల దూరంలో కృష్ణా నది తీరంలో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉందని స్థానికులు తెలిపారు. ఇటీవల కృష్ణా నదిలో ముగ్గురు గల్లంతు కావడం గమనార్హం.

బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్: బీసీ రిజర్వేషన్ వ్యతిరేకులకు రాజకీయ సమాధి తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆయన శనివారం నల్లగొండలోని బీసీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం కల్పించగా, రెడ్డి జాగృతికి చెందిన కొంతమంది కోర్టుల ద్వారా అడ్డుకోవాలని చూస్తున్నారని అన్నారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే భవిష్యత్తులో బీసీలంతా ఒక్కటై వారిని రాజకీయంగా సమాధి చేస్తారని ఆయన అన్నారు. ఉన్న జనాభా కంటే 18 శాతం రిజర్వేషన్లు తక్కువ చేసి 42 శాతంతో బీసీలకు సరిపెట్టి స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ, రెడ్డి జాగృతికి చెందిన వారు బీసీ రిజర్వేషన్లు చెల్లవంటూ కోర్టులకు వెళ్లారని తెలిపారు. ఐదు శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు గత 80 ఏళ్లుగా 90 శాతం పదవులు అనుభవిస్తూ బీసీల వాటాను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ నెల 8న రాష్ట్ర హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసు ఉన్నందున స్థానిక సంస్థల ఎన్నికలు జరగవంటూ.. బీసీ రిజర్వేషన్ల అమలు కావంటూ కొంతమంది ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లకు గవర్నర్ ఆమోదముద్ర వేసే బాధ్యత బీజేపీ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఆగిపోతే దానికి బీజేపీ బాధ్యత వహించాలన్నారు. మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, కాసోజు విశ్వనాథం, నల్ల సోమ మల్లన్న, కేశబోయిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి



నరేష్ (ఫైల్)

కట్టంగూర్: ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలం పరడ గ్రామంలో శుక్రవారం జరగగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరడ గ్రామానికి చెందిన కొండూరి నరేష్(26) కూలీ పనులతో పాటు అదే గ్రామానికి చెందిన నిమ్మనగోటి భాస్కర్ ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం గ్రామంలోని ఓ రైతు తన పొలాన్ని హార్వెస్టర్‌తో కోయిస్తుండగా.. వరి ధాన్యాన్ని తరలించేందుకు ట్రాక్టర్ యజమాని పిలుపు మేరకు నరేష్ ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో హార్వెస్టర్ డ్రైవర్‌తో పాటు అక్కడ ఉన్న వారు భోజనం చేసేందుకు వెళ్లారు. అదే సమయంలో నరేష్ కూడా విశ్రాంతి తీసుకునేందుకు ట్రాక్టర్ ట్రాలీ కింద పడుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత వరికోత తిరిగి ప్రారంభం కాగా.. నరేష్ కనిపించకపోవటంతో అదే గ్రామానికి మరో ట్రాక్టర్ డ్రైవర్ ఎస్కే రహీమ్ నరేష్ నడిపే ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి ముందుకు కదిలించాడు. దీంతో ట్రాక్టర్ ట్రాలీ కింద నిద్రించిన నరేష్ తలపై నుంచి టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు రహీమ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE

■ Indusland Bank, సూర్యాపేట బ్రాంచ్ నందు Maruti Ertiga Hyd VXI (o) 1.5 MT BSVI, Vehicle No. TS 29R 3684 కారు అమ్మకానికి కలదు. 9885407953, 9384065230 [SCA 25008699]

Real Estate

HOUSE FOR SALE

■ నల్లగొండలోని పానగల్ రోడ్ ఫ్లైఓవర్ ప్రక్కన వైకుంఠనగర్ కాలనీలో 2 సింగిల్ బెడ్‌రూం పోర్షన్స్ గల ఇల్లు అమ్మకమునకు కలదు. ప్రస్తుతం నెలకు 10 వేల అద్దె వస్తుంది. సంప్ర॥ 9441703113, 8897811393 [YA-16155]

■ 2, 3&4BHK లగ్జరీ విల్లాలు నివసించుటకు సిద్ధంగా ఉన్నాయి. రూ. 80 లక్షల నుండి, డి-మార్ట్ పక్కన మిర్యాలగూడ, ఆధునిక సౌకర్యాలు, క్లబ్, స్విమ్మింగ్ పూల్. సంప్ర : Ph: 7013578378 [HA-507]

COMMERCIAL

■ Commercial Space up to 5000 Sqft. NE Corner Building on Main Road, Opp to Area Hospital, Bhuvanagiri. Ph : 8790311130 / 9701121316 [HA-35460]

PLOT FOR SALE

■ వలిగొండ మండలం యాదాద్రి జిల్లా ఆరూర్ గ్రా.HMDA Layout CNR Golden Cityలో 366చ.గజ Plot E/F. 33" Roadతో అమ్మకమునకు కలదు. with Compund wall, గజం 8000/– ఫోన్: 9246878478 [HA-1770]

Wanted

WANTED TEACHERS

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీవార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్,నర్సులు, కాంపౌండర్స్, వాచ్‌మేన్స్, సెక్యూరిటీ గార్డ్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391036931 [HA-16191]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9505508382
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆదర్శ ఉపాధ్యాయుడు.. వెంకట్‌రెడ్డి సార్



విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి



టై, బెల్టులు పంపిణీ చేస్తున్న వెంకట్‌రెడ్డి

- ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన ప్రభుత్వ టీచర్
- పలు అవార్డులు ఆయన సొంతం

నేడు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

వరించిన అవార్డులు

విద్యాభివృద్ధికి వెంకట్‌రెడ్డి చేస్తున్న కృషికి గుర్తింపుగా గ్లోబల్ టీచర్ అవార్డు, జాతీయ విద్యారత్న అవార్డు, జాతీయ పుడమి అవార్డు, తెలంగాణ ప్రతిభారత్న, మదర్‌థెరిస్సా ఉత్తమ సేవా పురస్కారం, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ వారిచే రెండుసార్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లాంటి మరెన్నో అవార్డులు లభించాయి.



గ్లోబల్ టీచర్ అవార్డు అందుకుంటున్న వెంకట్‌రెడ్డి

పెద్దవూర: ఆయన ఏ పాఠశాలలో పనిచేసినా తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరుచుకున్నారు. ఎందరో విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది పలు అవార్డులు సైతం సొంతం చేసుకున్నారు పెద్దవూర మండలంలోని ఏనేమీదిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తూడి వెంకట్‌రెడ్డి. ఆయన పనిచేసిన ప్రతీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం, మౌలిక వసతులు కల్పించడం, ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, రీసోర్స్‌పర్సన్‌గా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంతో పాటు విద్యార్థులకు యోగా, ధ్యానం, వ్యక్తిత్వ వికాస తరగతుల నిర్వహిస్తూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

● 2001 డీఎస్సీలో ఎంపికైన వెంకట్‌రెడ్డి నిడమనూరు మండలం కుంటిగొర్లగూడెం పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించి అక్కడే 2009 వరకు హెచ్ఎంగా పనిచేశారు. ఇక్కడ పక్కా భవనం లేకపోవడంతో ఐదున్నరేళ్ల చెట్ల కిందనే పాఠశాలను కొనసాగించి అత్యుత్తమ పాఠశాలగా తీర్చిదిద్ది ప్రజాప్రతినిధులతో పాటు ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. పాఠశాలకు పక్కా భవనం మంజూరైనా స్థలం లేకపోవడంతో గ్రామానికి చెందిన అబ్బయ్య తన సొంత ఇంటి స్థలాన్ని పాఠశాలకు కేటాయించారు. వెంకట్‌రెడ్డి సార్ ప్రోత్సాహంతో నేడు ఆ గ్రామంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి ఉన్నత చదువులు చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డవారు ఎందరో ఉన్నారు. 2009లో వేములపల్లి మండలం శెట్టిపాలెం హెచ్ఎంగా బదిలీపై వెళ్లి 65 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలను 108 మందికి పెంచారు. 2015లో త్రిపురారం మండలం బాబుసాయిపేట యూపీఎస్‌కు బదిలీపై వెళ్లారు. మూతపడే స్థితిలో ఉన్న ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 150 మందికి పెంచారు. ఇంగ్లిష్ మీడియంను కూడా ప్రారంభించారు. తొమ్మిదేళ్ల పాటు విద్యార్థులకు తన సొంత ఖర్చులతో బెల్టులు, టై, నోట్‌బుక్స్‌తో పాటు భోజనం ప్లేట్లను సైతం పంపిణీ చేశారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లోని నిరుపేద విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి ఉన్నత చదువులు చదివేలా, ప్రభుత్వ ఉద్యోగాలు పొందేలా ప్రోత్సహించారు. గత 15 ఏళ్లుగా ప్రాథమిక స్థాయి గణితంతో పాటు వివిధ అంశాలపై జిల్లా రీసోర్స్‌పర్సన్‌గా, మాస్టర్ ట్రైనర్‌గా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన తొలిమెట్టు కార్యక్రమంలో స్టేట్ రీసోర్స్‌పర్సన్‌గా గణిత ఉపాధ్యాయ కరదీపిక రూపకల్పనలో భాగస్వామ్యమి అయ్యారు.